



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సవాల్... ప్రతి సవాల్

- యువగళం పాదయాత్రలో ఉద్రిక్తత - మీసం మెలేసిన ఎమ్మెల్యే... అరెస్టు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/క్రైమ్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రలో సవాల్, ప్రతి సవాళ్ల పర్వం కొనసాగుతోంది. మొన్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అవినీతి గురించి లోకేష్ మాట్లాడుతూ... ఆయన 'కరప్షన్ భూపాల్ రెడ్డి' అంటూ పలు భూకబ్జా విషయాలను వెల్లడించారు. కాటసాని రాంభూపాల్ రెడ్డి దానికి స్పందించి తనపై లోకేష్ చేసిన ఆరోపణలను నిరూపిస్తే ఎమ్మెల్యే పదవి నుంచి తప్పుకుంటానని, దమ్ముంటే కొండారెడ్డి బురుజు వద్దకు చర్చకు రావాలని ప్రతి సవాల్ విసిరారు. శనివారం కర్నూలు నియోజకవర్గంలోకి ప్రవేశించిన యువగళం పాదయాత్రలో భాగంగా ఆదివారం ముస్లిం, మైనారిటీలతో లోకేష్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ భూములు కబ్జా చేసినట్లు పేర్కొన్నారు. బుధవారపేటలోని ఒకటిన్నర ఎకరాల వక్ఫ్ బోర్డు భూమిని ఎమ్మెల్యే కబ్జా చేశారని విమర్శించారు. దిన్నెదేవరపాడు వద్ద 60 ఎకరాల భూమిని ఎమ్మెల్యే అనుచరులు వెంచర్లుగా మార్చారని వెల్లడించారు. సోమవారం ఉదయం ఎస్‌టిబిసి విడిది కేంద్రం నుంచి యాత్ర ప్రారంభమైంది. పాదయాత్ర ప్రారంభానికి ముందే కర్నూలు ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. తనపై లోకేష్ చేసిన ఆరోపణలను నిరూపించాలని, ఎక్కడికి రావాలో చెప్పాలని, లేకుంటే తానే పాదయాత్ర వద్దకు వస్తానని సవాల్ చేశారు. నారా లోకేష్ పాదయాత్ర కొనసాగుతుండగా లాల్ మసీదు వైపు నుంచి ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ నడుచుకుంటూ పూల బజార్ వైపు పాదయాత్రకు ఎదురు వెళ్లే ప్రయత్నం చేశారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాదయాత్రలో ఉండటం వైసిపి ఎమ్మెల్యే పాదయాత్రకు ఎదురు వెళ్లడంతో పూల బజార్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అంతలో అప్రమత్తమైన పోలీసులు ఆయనను ఆపేందుకు ప్రయత్నం చేశారు. అరెస్టు చేసి పోలీసు వాహనంలో ఎక్కిస్తుండగా ఎమ్మెల్యే లేచి నిలబడి మీసం మేలేస్తూ ఆరోపణలను నిరూపించాలంటే నినాదాలు చేశారు. అనంతరం జిల్లాలోని టిడిపి ముఖ్య నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ ఆధారాలు అడగాల్సింది లోకేష్‌ను కాదని, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ.మోహన్ రెడ్డిని అని పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్యే ఆరోపణలపై జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు.



ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

న్యాయవాదుల ఆందోళన.. ఉద్రిక్తత...

కర్నూలు నగరంలో ఉద్రిక్తత నెలకొంది. నగరంలో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర సాగుతుండగా పలువురు న్యాయవాదులు ఎస్‌బిఐ సర్కిల్ దగ్గర ఆందోళన చేపట్టారు. లోకేష్‌ను అడ్డుకునేందుకు 'లోకేష్.. గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. పోలీసులు రోప్ సహాయంతో వారిని నిలువరించడంతో పాదయాత్ర సాఫీగా ముందుకు సాగింది. పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. నిరసన తెలిపిన వైసిపి న్యాయవాదులకు లోకేష్ కౌంటర్ ఇచ్చారు. హైకోర్టు తెస్తానంటూ మాటిచ్చి మోసం చేసిన జగన్ ఇంటి ముందు నిరసన తెలపండి అంటూ వ్యాఖ్యానించారు. బుగ్గన బెంగళూరు వెళ్లి విశాఖలో హైకోర్టు అన్నారని, సుప్రీం కోర్టులో అమరావతిలోనే హైకోర్టు అని అఫిడవిట్ వేశారని తెలిపారు. వైసిపి న్యాయవాదులు, సాక్షి, బ్లూ మీడియా నిరసన తెలపాల్సింది జగన్ ఇంటి ముందు, తన ముందు కాదు అంటూ వ్యాఖ్యానించారు.



మీసం మెలేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

బైపాస్ హైవే రోడ్డు రైతులకు న్యాయమైన

నష్టపరిహారమివ్వాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ
- కలెక్టరేటర్ వద్ద బాధిత రైతులతో కలిసి ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఆరు లైన్ల రోడ్డు కోసం, బైపాస్ హైవే రోడ్డు కోసం భూములు ఇస్తున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆరు లైన్ల రోడ్డు, హైవే రోడ్డు బాధిత రైతులతో కలిసి ఆర్‌డిఓ, తహశీల్దార్, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరు లైన్ల రోడ్డు కోసం, హైవే రోడ్డు కోసం కర్నూలు, కల్లూరు మండలాల్లో 12 గ్రామాల రైతుల నుంచి 300 ఎకరాలు, బి.తాండ్రపాడు నుంచి గార్గేయపురం వరకు ప్రభుత్వం సేకరిస్తుందని తెలిపారు. దీనికోసం రైతులకు చాలా అన్యాయమైన పరిహారం ఇస్తున్నారని విమర్శించారు. దిన్నెదేవరపాడు, నందనపల్లె, గార్గేయపురం భూములు రూ.3 కోట్ల విలువ చేసే భూములని, అక్కడి రైతులకు రూ.30 లక్షలు, నందనపల్లి గ్రామ రైతులకు రూ.8 లక్షలు మాత్రమే నష్టపరిహారం ఇస్తున్నారని తెలిపారు. ఉల్చాల, తులసీపురం, సింగవరం గ్రామాలు మూడు కారుల పంట పండే భూములని, దాని విలువ రూ.2 కోట్లు చేస్తుందని చెప్పారు. అక్కడి రైతులకు రూ.12 లక్షలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. ఈ పరిహారం తమ భూములకు ఏమాత్రమూ సరిపోదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ తిరస్కరిస్తున్నారని, ప్రభుత్వం రైతుల అనుమతి లేకుండానే వారి బ్యాంకులో డబ్బులు జమ చేస్తోందని తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చామని, వెంటనే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. హంద్రీనీవా బోర్ల కింద భూములు సాగు అవుతున్నాయని, ఇళ్ల స్థలాల కోసం వెంచర్లు వేయడం వల్ల రూ.కోట్ల విలువ పలుకుతుందని చెప్పారు. అలాంటి భూములకు నామమాత్రమైన నష్టపరిహారం ఇవ్వడం ఏమాత్రం సమంజసం కాదని తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వం స్పందించకపోతే పనులు జరగకుండా రైతులందరినీ ఐక్యం చేసి అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. నందనపల్లె గ్రామ రైతులకు ఎకరాకు రూ.60 లక్షలు ఇవ్వాలని, రుద్రవరం, గార్గేయపురం గ్రామ రైతులకు ఎకరాకు రూ.80 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉల్చాల, సింగవరం, తులసీపురం, బసాపురం, ఆర్.కొంతలపాడు, ఎదురూరు గ్రామాల రైతులకు రూ.80 లక్షలు తక్కువ కాకుండా ఇవ్వాలని కోరారు. దిన్నెదేవరపాడు, పందిపాడు, లక్ష్మీపురం గ్రామ రైతులకు ప్లాట్లు వేసిన పొలాలని, తగిన విధంగా నష్టపరిహారం చెల్లించాలని తెలిపారు. రైతు సంఘం కర్నూలు మండల కార్యదర్శి మృత్యుంజయ, అధ్యక్షులు ఆంజనేయులు, కల్లూరు మండల కార్యదర్శి కృష్ణ, నాయకులు మాధవరెడ్డి, వెంకటయ్య, రాఘవేంద్ర, బాధిత రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తతతో ఉండాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన
- స్పందనలో బాధితుల నుంచి అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈజ్ ఆఫ్ డూయింగ్....ఈజ్ ఆఫ్ లివింగ్ ఫీడ్ బ్యాక్ సర్వే జరగనున్నందున అధికారులు అప్రమత్తతతో ఉండాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్పందన నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జెసి నారపురెడ్డి మౌర్య ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడారు. పరిశ్రమల శాఖకు సంబంధించి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద ఒక సర్వే జరగనుందని తెలిపారు. కొత్తగా ఈసారి ఈజ్ ఆఫ్ లివింగ్‌కు సంబంధించి కూడా సర్వే జరుగుతుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా లబ్ధి పొందిన వారు పొందిన సర్వీసుల పట్ల సంతృప్తిగా ఉన్నారా లేదా అని ఫోన్ కాల్ ద్వారా లబ్ధిదారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈజ్ ఆఫ్ లివింగ్‌కు సంబంధించి జనవరి 1, 2022 నుంచి అక్టోబర్ 31 వరకు సచివాలయాలు, మీసేవల ద్వారా సర్వీసుల పొందిన వారి వివరాలు భారత ప్రభుత్వానికి సమర్పించినట్లు చెప్పారు. సచివాలయం, వాలంటీరు సిబ్బంది సేవలు పొందిన లబ్ధిదారులకు ఫోన్ కాల్ వస్తుందని తెలిపారు. సదరు ఫోన్ కాల్‌కు వారు స్పందించి పొందిన సేవల పట్ల వారి అభిప్రాయం వ్యక్తం చేసేలా చూడాల్సిన బాధ్యత ఎంపిడిఒలు, ప్రత్యేకాధికారులపై ఉంటుందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను బట్టి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు సంబంధించి దేశ వ్యాప్తంగా ర్యాంకింగ్ ఆధారపడి ఉంటుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందన్నారు. 'జగనన్నకు చెబుదాం'కు సంబంధించి ఇంకా పూర్తి స్థాయిలో నియంత్రణలోకి రావాల్సి ఉందని తెలిపారు. అందులో ఎక్కువ శాతం పోలీస్ శాఖకు సంబంధించి ఉన్నాయని, వచ్చిన అర్జీలను ఓపెన్ చేయడం లేదని చెప్పారు. వచ్చిన అర్జీలను ఎస్‌హెచ్‌ఒలు ఓపెన్ చేసి పాజిటివ్‌గా నివృత్తి చేసేలా చూడాలన్నారు. జిల్లా అధికారులు రోజూ రెండు సార్లు వారికి సంబంధించిన లాగిన్స్‌ను ఓపెన్ చేసి చూస్తూ ఉండాలన్నారు. ఇప్పటి వరకు ఇంకా అధికారుల అర్జీలు చూడాల్సినవి 29 వరకు ఉన్నాయని, అందులో ఎక్కువ పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించినవి ఉన్నాయని తెలిపారు. రీఓపెన్ కేసులపైనా ఆడిట్ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఈజ్ ఆఫ్ డూయింగ్... ఈజ్ ఆఫ్ లివింగ్ పట్ల సర్వే జరగనుందని తెలిపారు. అందుకు సంబంధించి సర్క్యులర్‌ను అందరూ జిల్లా అధికారులకు పంపేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జిఎంను ఆదేశించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, రమ, నాగ ప్రసన్న లక్ష్మి, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, సిపిఒ అప్పలకొండ, జిల్లా స్థాయి అధికారులు, మండలాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి

కర్నూలు జనసంద్రంగా...

- లోకేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర కర్నూలు నగరంలో హోరెత్తింది. యువనేత పాదయాత్రతో నగరంలోని వీధులన్నీ కిక్కిరిసిపోయి, జనసంద్రంగా మారాయి. లోకేష్‌ను చూసేందుకు మహిళలు, యువత, వృద్ధులు భారీగా రోడ్లపైకి వచ్చారు. కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలను నగరవాసులు లోకేష్ దృష్టికి తెచ్చారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే కర్నూలులో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని, మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కోర్టు భవనం ముందు న్యాయవాదులు లోకేష్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని చెప్పడంతో న్యాయవాదులు ధన్యావాదాలు తెలిపారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... కర్నూలుకు కేటాయించిన జ్యుడిషియల్ అకాడమీని జగన్ తరలించారన్నారు. హైకోర్టు ఏర్పాటు చేస్తామని నాలుగేళ్లుగా మోసం చేశారని, అమరావతిలోనే హైకోర్టు ఉంటుందని సుప్రీం కోర్టులో వైసిపి ప్రభుత్వం తెలిపిందని అన్నారు. విశాఖలో హైకోర్టు అని మంత్రి బుగ్గన చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. జగన్ మాయ మాటలు విని మోసపోయామని న్యాయవాదులు పేర్కొన్నారు. యువనేత లోకేష్ మాట్లాడుతూ... జగన్‌లా మాట మార్చి, మడమ తిప్పే బ్యాచ్ తమది కాదని, కర్నూలులో హైకోర్టు బెంచ్ కచ్చితంగా ఏర్పాటు చేసి తీరుతామని స్పష్టం చేశారు. యువనేత కర్నూలు పర్యటనలో వినతులు వెల్లువెత్తాయి. ఎస్సీలు, యాదవులు, వీరశైవులు, బీసీలు, నగర ప్రజలు, ఎలక్ట్రికల్ వర్కర్లు తదితరులు యువనేతను కలిసి సమస్యలు చెప్పుకున్నారు. ఎస్‌టిబిసి నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఓల్డ్ టౌన్, జోహరాపురం మీదుగా పుల్లయ్య కళాశాల విడిది కేంద్రం వరకు సాగింది. పాదయాత్రలో మాజీ మంత్రులు భూమా అఖిల ప్రియ, అమర్‌నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బిటి.నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ టిజి.భరత్ పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేష్

యువగళంకు విశేష ఆదరణ

- టిడిపి నాయకులు ఆకెపోగు జయన్న



మాట్లాడుతున్న జయన్న

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని కోడుమూరు నియోజకవర్గ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, టిడిపి నాయకులు ఆకెపోగు జయన్న అన్నారు. యువగళం పాదయాత్ర కోడుమూరు నియోజకవర్గం కర్నూలు రూరల్ మండలంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు టిడిపి నాయకులు నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభించారన్నారు. ఆయన పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు.కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటానని చెప్పి గాలికి వదిలేసిందన్నారు. రైతు, యువకుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని ప్రజలు అభిప్రాయపడుతున్నారన్నారు. ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎలాంటి నిధులు కేటాయించకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. సర్పంచులను దిష్టిబొమ్మలుగా చేసి ఆడిస్తోందన్నారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను ఇవ్వకుండా గ్రామాల అభివృద్ధిని నీరుగా గారుస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గత ఎన్నికల స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి హవా కొనసాగితే అందుకు భిన్నంగా కోడుమూరు నియోజకవర్గంలో టిడిపి హవా కొనసాగిందన్నారు. దీనికి టిడిపి సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి ప్రజలకు చేసిన సేవలే కారణమన్నారు. ఇది రాజకీయ చరిత్రలో ఓ మైలురాయిగా పేర్కొన్నారు. ఆయనకు అవకాశం ఇస్తే కర్నూలు ఎంపీ ఎమ్మెల్యే స్థానిక సంస్థలన్నీ హస్తగతమవుతాయని అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.

సహకార దుకాణ సముదాయం ప్రారంభం

ప్రజాశక్తి - సి బెళగల్

బెళగల్ బస్టాండ్ ఆవరణంలో రూ.38 లక్షలతో నిర్మించిన సహకార దుకాణ సముదాయంను కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ చేతుల మీదుగా సొసైటీ సింగిల్ విండో అధ్యక్షులు గోపాల్ రెడ్డి సమక్షంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని బెళగల్ సహకార కేంద్రం అభివృద్ధి పథంలో ఉందని, రూ.50 కోట్ల లావాదేవీలు జరగడం గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఈఓ పి,రామాంజనేయులు, డీసీఓ ఎన్ రామాంజినేయులు, చీఫ్ మేనేజర్ నాగమద్దిలేటి, డీపీడిహెచ్ భరద్వాజా గౌడ్, డిజిఎంలు విజయ్ కుమార్, సునీల్ కుమార్, ఉమామహేశ్వర్ రెడ్డి, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

రాజకీయ లబ్ధికోసమే లోకేష్ ఆరోపణ

- నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తా
- కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ.హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

నారా లోకేష్ చేస్తున్న ఆరోపణలు రాజకీయ లబ్ధి కోసమే తప్ప అందులో ఎలాంటి వాస్తవాలు లేవని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్ ఖాన్ అన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని స్థానిక రాయల్ ఫంక్షన్ హాల్‌లోని ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు భూములను కబ్జా చేసినట్లు టిడిపి నాయకులు, నారా లోకేష్ తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. తాను కబ్జాదారుడుని కాదని, కిరాయిదారున్ని అని మాత్రమేనన్నారు. సదరు భూమిలో తన తండ్రి 1973లో కిరాయికి తీసుకుని తాత్కాలిక వర్క్‌షాప్ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ఆ స్థలంలో ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టలేదని చెప్పారు. ఆ స్థలానికి సంబంధించిన విషయంలో కొన్ని సమస్యలు కోర్టు పరిధిలో ఉన్నాయని, వర్క్ షాపు ద్వారా పేదలకు, కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. దిన్నెదేవరపాడులోని సర్వే నెంబర్ 19లో 50 ఎకరాల్లో వక్ఫ్ భూములను అన్యాక్రాంతం చేసినట్లు ఆరోపణలు చేస్తున్నారన్నారు. మీ తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వాటికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లను మంజూరు చేశారని గుర్తు చేశారు. తమ కుటుంబం ఒకరికి పెట్టేదే తప్ప తీసుకునేది కాదన్నారు. ప్రజల కోసం అన్నింటినీ వదులుకొని రాజకీయంలోకి వచ్చానన్నారు. నారా లోకేష్ ఆశయం కేవలం తండ్రిని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. ఆధారాలు లేకుండా ఒకరిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఒక ఇంచు భూమి కబ్జా చేశామని నిరూపిస్తే ఈ జిల్లానే వదిలి వెళతానన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం కాదని, దమ్ముంటే లోకేష్ బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. వక్ఫ్ భూములు కబ్జా కాకుండా ఎన్నోసార్లు అధికారులకు చెప్పానన్నారు. ముస్లింలకు అత్యంత పవిత్రమైనది ఖురాన్ అని, దాన్ని పట్టుకొని ఏ మసీదు దగ్గరికైనా, దర్గా వద్దకైనా వస్తానన్నారు. ముస్లింల పట్ల ఇప్పటికిప్పుడు ప్రేమ ఎందుకు పొంగుకొస్తుందో చెప్పాలన్నారు. గతంలో మాజీమంత్రి ఫరూక్‌ను ముఖ్యమంత్రి నేలపై కూర్చోబెట్టి అవమానించిన సంగతి గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు. నాలుగు శాతం ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తున్నప్పుడు ఏం చేశారన్నారు. బిజెపి ఎన్‌ఆర్‌సి చట్టాన్ని ప్రవేశపెట్టడానికి టిడిపి సంపూర్ణ మద్దతు ఇచ్చిందని, దాన్ని వెనక్కి తీసుకోవాలని ఎందుకు అడగలేదన్నారు. మొదట మద్దతిచ్చినా తప్పు తెలుసుకుని అసెంబ్లీలో దాన్ని వ్యతిరేకిస్తూ రద్దు చేయాలని తీర్మానం చేసిన ధైర్యశాలి జగన్మోహన్ రెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకోమని ధైర్యంగా కనీసం ప్రకటన చేయగలరా అని ప్రశ్నించారు. ముస్లింలకు మంత్రివర్గంలో టిడిపి ఎన్ని పదవులు ఇచ్చిందో చెప్పాలన్నారు. ముస్లింలకు అత్యధిక రాజకీయ పదవులు ఇచ్చిన ఏకైక పార్టీ వైసిపి అన్నారు. అభివృద్ధికి సంబంధించి గతంలో టిడిపి జిల్లాలో 23 రకాల హామీలు ఇచ్చి గాలికి వదిలేసిందన్నారు. కర్నూలు నగరంలో రూ.400 కోట్ల పనులు వివిధ దశల్లో నిర్మాణం చేపట్టామన్నారు. అందులో రూ.87 కోట్లతో సుంకేసుల నుండి కర్నూలు నగరానికి తాగునీటి కోసం నూతన పైపులైను ఏర్పాటు చేశామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలలు, హాస్పిటల్లో, హైవే బ్రిడ్జిలు, నిర్మాణాలు చేపట్టామన్నారు. కోవిడ్ సమయంలో ప్రజలంతా బాధపడుతుంటే తండ్రి కొడుకులిద్దరూ ఏసి రూముల్లో దాక్కున్నారన్నారు. తాను మాత్రం నగరంలో ప్రజల కష్టనష్టాలను పంచుకుంటూ వారికి ఆర్థిక, నిత్య అవసరాలను తీర్చే దిశగా ప్రజలతో ఉన్నానన్నారు. తన సేవలను మెచ్చి రాష్ట్రమే కాకుండా పొరుగు రాష్ట్రం తనకు అవార్డును ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

యాగంటిలో బహిరంగ చర్చకు సిద్ధంకండి

- కబ్జాలపై ఆధారాలు, బాధితులతో వస్తాం : గౌరు వెంకటరెడ్డి దంపతులు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

పాణ్యం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి బంధువులు, అనుచరవర్గం చేస్తున్న కబ్జాలపై కర్నూలులో నారాలోకేష్ పాదయాత్ర ముగిసిన తరువాత యాగంటిలో బహిరంగ చర్చకు సిద్ధం కావాలని గౌరు వెంకటరెడ్డి దంపతులు పాణ్యం ఎమ్మెల్యేకు సూచించారు. సోమవారం గౌరు దంపతులు వారి స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో భూములు ఆక్రమణకు గురైన బాధితులతో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యే పేరు చెప్పుకుంటూ బావమరిది దస్తగిరి రెడ్డి, అనుచరులు చేసిన భూ ఆక్రమణలు మీకు తెలియదా అని వారు ప్రశ్నించారు. భూ కబ్జాలపై టిడిపి సవాల్‌ను స్వీకరించిన కాటసాని రాంభూపాల్ రెడ్డికి అభినందనలు తెలిపారు. యాగంటిలో బహిరంగ చర్చకు బాధితులతో కలిసి వస్తామని తెలిపారు. అనంతరం బాధితులు, ముస్లిం మైనారిటీ నాయకులు మాట్లాడుతూ కల్లూరు అర్బన్ పరిధిలోని ముజఫర్ నగర్ ప్రాంతంలో వక్ఫ్ బోర్డు సర్వే నంబర్ 524లో 10.64 ఎకరాలు ఉండగా ఇందులో కేవలం మూడు ఎకరాలు మాత్రమే కేటాయిస్తూ నిర్మాణం చేపట్టడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఆ భూమి కోసం పోరాటం చేస్తున్న నేపథ్యంలో కొందరు దుండగులు తమ సామాజిక వర్గంపై దాడి చేశారని ఆవేదన చెందారు. టిడిపి నాయకులు మౌలాలి మాట్లాడుతూ ఆక్రమణ దారుల నుండి వక్ఫ్‌బోర్డు భూమిని కాపాడుకునేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ సమస్యపై అప్పటి ఎంఆర్‌ఓ కూడా డబ్బులు ఇచ్చి ప్రలోభపెట్టేందుకు ప్రయత్నం చేశారని ఆరోపించారు. జొహరాపురం పరిధిలోని 121 సర్వే నంబర్ భూమికి చెందిన యజమాని దాదాబాషా మాట్లాడుతూ 1931లో 1.89 ఎకరాలు తన కుటుంబీకులు కొనుగోలు చేశానని, ఆ భూమికి హక్కుదారుడిగా అన్ని ఆధారాలతో ఉన్న తన భూమిని ఎమ్మెల్యే బావమరిది దస్తగిరి రెడ్డి, అనుచర వర్గంతో కలిసి ఆక్రమణ చేసేందుకు ప్రయత్నం చేశారని చెప్పారు. ఆ ఘటనలో తనను చంపుతామని బెదిరింపులకు పాల్పడినట్లు స్పష్టం చేశారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ కొట్టే చెన్నయ్య, సహచర ప్లాట్ల యజమానులతో కలిసి మాట్లాడుతూ లక్ష్మీపురం గ్రామ పరిధికి చెందిన వెంకట సాయి నగర్‌లో 2006 నుండి 2010 వరకు ప్లాట్లు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ భూమిని జయన్న, డేవిడ్‌లకు నకిలీ ఎక్స్ సర్వీస్‌మెన్ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి 7.08 ఎకరాలు బోగస్ పత్రాలు సృష్టించి అక్రమణ చేశారన్నారు. అప్పటి తహసీల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి చేపట్టిన విచారణలో నకిలీ పత్రాలు బహిర్గతం అయినట్లు తెలిపారు. అయితే కోర్టు విచారణలో ఉండగా దస్తగిరి రెడ్డి, అనుచరవర్గంతో స్వాధీనం చేసుకునేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. అలాగే కల్లూరు అర్బన్, ఓర్వకల్లు మండలంలోని కొందరు బాధితులు వారికి జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్లెల రాజశేఖర్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, నంద్యాల పార్లమెంట్ ఉపాధ్యక్షులు, గుట్టపాడు సర్పంచి మోహన్ రెడ్డి, సంపతి లక్ష్మీరెడ్డి, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌరు వెంకటరెడ్డి దంపతులు

యోగా సాధనలో నైపుణ్యం పెంపొందించుకోవాలి

- అవుకు జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - కర్నూల్ స్పోర్ట్స్ : విద్యార్థులు తమ దైనందిక జీవితంలో క్రమం తప్పకుండా యోగ సాధన చేసుకుంటే మంచి ఆరోగ్యంతో పాటు ఆనందంగా జీవించవచ్చని అవుకు జెడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం నగరంలోని అవుట్డోర్ స్టేడియం నందు ఏర్పాటు చేసిన వేసవి యోగ శిక్షణ శిబిరాలను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని సత్తా చాటి పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. అనంతరం జాతీయ యోగా సంఘం సభ్యులు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక జీవనంలో యోగా సాధనతో మంచి ఫలితాలు సాధించవచ్చున్నారు. ఏకాగ్రతతో సాధించలేనిది ఏదీ లేదని, విద్యార్థులు క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ప్రధాన శిక్షకులు నటరాజరావు, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, డాక్టర్ రమేష్, యోగా శిక్షకులు ముంతాజ్ బేగం, ప్రసన్న, విజయ్ కుమార్‌లు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన నిర్వహించారు. డివిజన్ స్థాయిలో అర్జీలు స్వీకరిస్తూ సంబంధిత అధికారులకు ఎండార్స్‌మెంట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోమవారం వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పూర్తి చేసేటట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. డిప్యూటీ తహశీల్దార్ రమాదేవి, డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి, డిఎల్‌పిఒ నూర్జహాన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, ఆర్‌టిసి డిపో మేనేజర్ రఫీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేతన్ ప్రియా, బీసీ వెల్ఫేర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

- మాజీ ఎమ్మెల్యే బీవీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 19వ వార్డులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. ముందుగా వార్డులోని టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి టిడిపి జెండాను ఆవిష్కరించారు. టిడిపి వ్యవస్థాపకులు కీర్తిశేషులు నందమూరి తారక రామారావు, మాజీ మంత్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వార్డులోని ప్రతి ఇంటికీ తిరిగి అధికార వైసిపి హయాంలో గ్రామంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుటుంబంలో నిరుద్యోగ సమస్య, అడ్డగోలు నిత్యావసర ధరలు, మద్యపానం, కుంటుపడిన అభివృద్ధి, ఇసుక మాఫియా, తాగునీటి సమస్య, అవినీతి, మహిళల భద్రత, విద్యుత్ సమస్య, రోడ్ల సమస్య, నిధుల దుర్వినియోగం, గిట్టుబాటు ధరలు, నిలకడలేని పాలన, రాజధాని రాజకీయాలు వంటి ఏ రకమైన సమస్య ఉందో అడిగి తెలుసుకున్నారు. 9261292612 ఫోన్ నెంబర్‌కు వారి మొబైల్ నుంచి మిస్డ్ కాల్ ఇప్పించారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు

- విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ శాంత

ప్రజాశక్తి - ఆదోని

పాఠశాల సమయంలో గ్రంథాలయానికి వచ్చే అవకాశం లేకపోవచ్చని, వేసవి సెలవుల్లోనైనా వచ్చి అవగాహన, ఆలోచన, సృజనాత్మకత శక్తిని పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మన్ బి.శాంత తెలిపారు. గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ శాంత ప్రారంభించారు. ప్రథమ శ్రేణి గ్రంథాలయ అధికారిణి కె.సుజాతతో కలిసి సరస్వతీ చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'సెల్ ఫోన్ వద్దు... పుస్తకం ముద్దు' అని విద్యార్థులు అలవరచుకోవాలని సూచించారు. అనంతరం గ్రంథాలయ అధికారిణి సుజాత మాట్లాడారు. జూన్ 11 వరకు రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు వేసవి విజ్ఞాన తరగతులు ఉంటాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న శాంత

విద్యుత్ సంస్థ మనుగడ, కార్మిక హక్కుల పరిరక్షణకు

సంఘటితంగా పోరాడాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యుత్ సంస్థ మనుగడ, విద్యుత్ సంస్థలో పని చేసే కార్మికుల హక్కుల పరిరక్షణకు సంఘటితంగా పోరాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు కోరారు. సోమవారం ఎమ్మిగనూరు ఎడిఎ కార్యాలయం వద్ద మేడే వారోత్సవాల సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, సిఐటియు ఆదోని డివిజన్ కార్యదర్శి పి.ఈరన్న, సిఐటియు ఎమ్మిగనూరు కార్యదర్శి బి.రాముడు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పి.నాగరాజు, మంత్రాలయం సబ్ డివిజన్ ఎడిఇ రాఘవేంద్ర, ఎఎఒ చంద్రబోస్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు మాట్లాడారు. మే డే స్ఫూర్తి కార్మిక వర్గానికి గొప్ప శక్తి అని తెలిపారు. నేడు కేంద్రంలో, రాష్ట్రంలో పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని విమర్శించారు. అనేక రాష్ట్రాల్లో పోరాటాల ఫలితంగానే విద్యుత్ రంగం కొంత నిలుపుదల అయిందన్నారు. విద్యుత్ రంగ పరిరక్షణకు, కార్మిక వర్గ పరిరక్షణకు ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని కోరారు. ఎమ్మిగనూరు విద్యుత్ సబ్ డివిజన్ ఎడిఇ నాగేంద్ర, మంత్రాలయం ఎడిఇ విశ్వశాంతి స్వరూప్, ఎమ్మిగనూరు ఎఎఒ చంద్ర బోస్ మాట్లాడుతూ... హక్కులతో పాటు విధుల పరిరక్షణకు ప్రతి కార్మికుడూ కట్టుబడి ఉండాలని కోరారు. జిల్లా, డివిజన్ నాయకులు బి.మహానంది, ఎన్.మల్లికార్జున, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రసన్న కుమార్, నాగన్న, రత్నకుమార్, అనిల్ కుమార్, కర్రెన్న, రసూల్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాసిరకం విత్తనాలు అరికట్టి.. నాణ్యమైన విత్తనాలు అందించాలి

- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మండలంలో నాసిరకం విత్తనాలను అరికట్టి, నాణ్యమైన విత్తనాలను అందించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతేడాది కొన్ని కంపెనీలు రైతులకు నాసిరకం విత్తనాలు అందించడంతో పంట దిగుబడి రాక రైతులు అప్పుల పాలయ్యారని తెలిపారు. రైతులు నష్టపోకుండా ఉండాలంటే రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని కోరారు. నాసిరకం విత్తనాలు విక్రయించే వారిపై వ్యవసాయ అధికారులు నిఘా పెట్టాలని కోరారు. వీరేష్, రామాంజనేయులు, వలీ, కేశవ, వెంకన్న, సత్యప్ప పాల్గొన్నారు.

అమ్మ వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సాయి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఎంఎం కాలనీలో వెలసిన శ్రీమాతా పరమేశ్వరి అమ్మవారి 35వ వార్షికోత్సవం సందర్భంగా రెండో రోజు సోమవారం ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశులు, దండోరా కొండయ్య, రామకృష్ణ, నరసింహులు, కౌన్సిలర్ చిన్నాలు ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



పథకాలను వివరిస్తున్న ప్రదీప్‌రెడ్డి

పి.తండాలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని పరమాన్ దొడ్డి తండా గ్రామంలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి రాష్ట్ర యువ నేత వై.ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల జగనన్న పాలనలో ఏయే పథకాల అందాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి బుక్ లెట్‌ను అందజేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను రికార్డు చేసి వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, ఎస్ఐ కిరణ్ పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవినీతి అరికట్టాలి

- చాగి, పాండవగల్లులో ఉపాధి పనులు కల్పించాలి
- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న



సమావేశంలో మాట్లాడుతున్న లింగన్న

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలో కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ చట్టంలో జరుగుతున్న అవకతవకలను అరికట్టి, చాగి, పాండవగల్లు గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల కార్యదర్శి డి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఉపాధి హామీ చట్టం కింద జోరుగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో అధికార పార్టీ కార్యకర్తలు, క్షేత్రస్థాయి సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఉపాధి హామీ ఉన్నతాధికారులు అవినీతిని అరికట్టాలని కోరారు. ఎన్ఐసి సర్వర్‌లోకి మార్చిన తర్వాత ఈ విధమైన విమర్శలు అక్కడక్కడ వినిపిస్తున్నాయని తెలిపారు. వారాంతపు మస్టర్ వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం పాత పద్ధతిలోనే మస్టర్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎంపిడిఒ మస్టర్ వెరిఫికేషన్ చేపడితే ఇలాంటివి జరగవని తెలిపారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతనెల రోజులుగా చాగి గ్రామంలో పనులు నిలిచిపోవడానికి కూడా ఇదే కారణమని తమకు సమాచారం వచ్చిందని తెలిపారు. పాండవగల్లు గ్రామంలో కూడా ఈ వారం పని నిలిపేసినట్లు చెప్పారు. వెంటనే ప్రభుత్వం పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధి ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఈనెల 22న కలెక్టరేట్ ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



పొలంలో ఉన్న మొసలి

చెన్నాపురంలో మొసలి కలకలం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని చెన్నాపురం గ్రామంలో మొసలి కలకలం రేపింది. ఎల్ఎల్‌సి కాలువ పక్కన అదే గ్రామానికి చెందిన రైతు వెంకట రాముడు వరి పంట పొలాల్లోకి మొసలి వచ్చింది. పొలంలో వరి కోత కోస్తున్న మిషన్‌కు మొసలి తగలడంతో డ్రైవర్లు గమనించారు. అప్పటికే మొసలి కాళ్లకు గాయాలు కావడంతో వారు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు అధికారులు మొసలిని సురక్షితంగా తరలించారు. అటవీ శాఖాధికారులు మాట్లాడుతూ... వంక, పంట పొలాల్లో రైతులు జాగ్రత్తగా చూసుకొని పని చేసుకోవాలని సూచించారు.

సిఐటియు అనుబంధంగా

నూతన హమాలీ సంఘం ఏర్పాటు



ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని సమతగేరి గ్రామంలో నూతన హమాలీ సంఘాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో నివసిస్తున్న వారికి సిఐటియు అనుబంధంగా సోమవారం సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, సిఐటియు మండల కార్యదర్శి సి.నాగరాజు ఆధ్వర్యంలో నూతన హమాలీ సమతగేరి లోడ్, అన్‌లోడ్ కాటా హమాలీ సంఘాన్ని ఏర్పాటు చేశారు. అలాగే హోళగుంద నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసులును సిపిఎం, సిఐటియు మండల కార్యదర్శులు, నూతన హమాలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిశారు.

10న పాలిసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈనెల 10న జరిగే పాలిసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం తన ఛాంబర్‌లో పాలిసెట్ పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడారు. కర్నూలు, ఆదోని ప్రాంతాల్లో మొత్తం 21 పరీక్ష కేంద్రాల్లో 7,240 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్షను ఎలాంటి పొరపాటు లేకుండా నిర్వహించాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న ఎఒ మల్లేష్ కుమార్

కౌలు రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోండి

- ఎఒ మల్లేష్‌కుమార్

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలో నేటి నుంచి గ్రామాల వారీగా కౌలు రైతు సదస్సులు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎఒ మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. సోమవారం బెళగల్‌లోని రైతుభరోసా కేంద్రంలో సమీక్షించి మాట్లాడారు. నేడు సంఘాల, సి బెళగల్-3లో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10న కంభదహాల్, బురాన్ దొడ్డి-2, 12న బురాన్ దొడ్డి-1, బ్రాహ్మణ దొడ్డి, 15న ముడుమాల, కొండాపురం, 16న కొత్తకోట -1, 2, 17న పోలకల్ -1, యనగండ్ల, 18న పోలకల్ -2, 3 రైతు భరోసా కేంద్రాల్లో సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. సిసిఆర్‌సి కార్డులు పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

'పది' రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పదో తరగతి పరీక్ష నిర్వహణలో భాగంగా విద్యార్థులు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు చలానా చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వెంకట రంగారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుని ద్వారా విద్యార్థులు తమ హాల్ టికెట్లపై సంతకాలు చేయించుకుని దరఖాస్తులతో పాటు చలానా అందజేయాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే ఎర్రకోట భూదందాపై నిరూపణ చేసుకోవాలి

- లోకేష్, బీవీపై విమర్శలు తగదు - టిడిపి పట్టణ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మెల్యే ఎర్రకోట భూ దందాపై నిరూపణ చేసుకోకుండా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్‌రెడ్డిపై విమర్శలు చేయడం తగదని టిడిపి పట్టణ నాయకులు విమర్శించారు. సోమవారం పట్టణ టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సుందర్ రాజు, కలీముల్లా, దయాసాగర్, రాందాస్ గౌడ్, రంగస్వామి గౌడ్, మైనార్టీ నాయకులు తురేగల్ నజీర్ అహ్మద్, మల్లికార్జున, మిఠాయి నరసింహులు, అంబేద్కర్ మాట్లాడారు. తమ నాయకులు లోకేష్, బీవీ.జయనాగేశ్వర రెడ్డి సర్వే నెంబర్లతో వైసిపి ఎమ్మెల్యే ఎర్రకోట అవినీతి గురించి విమర్శిస్తే ఇంత వరకు అది నిజమా, కాదా? అనే విషయాన్ని ప్రజలకు స్పష్టం చేయలేదని తెలిపారు. అటు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి కానీ, ఇటు ఆయన తనయుడు జగన్మోహన్ రెడ్డి కానీ పొంతన లేని సమాధానం చెబుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఒకరోజు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి విలేకరుల సమావేశంలో కడిమెట్ల పంచాయతీ పరిధిలో గల చెన్నకేశవ స్వామి దేవాలయం భూమిని శిస్తు కట్టి లీజుకు తీసుకుని అనుభవంలో ఉన్నామని చెబుతుంటే, మరో వైపు ఆయన తనయుడు జగన్మోహన్ రెడ్డి అది తాత, ముత్తాల నుంచి సంక్రమించిన ఆస్తి అని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. తమ ప్రయతమ నాయకులు వారిపై చేసిన విమర్శలు నిజమా కాదా అనే విషయాన్ని ప్రజల మధ్య బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అది అబద్ధమైతే సాక్ష్యా ధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. టిడిపి పట్టణ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నందవరం : ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సమాధానం చెప్పకుండా ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు ఈరన్న గౌడ్, ఎల్ఎల్‌సి మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి, కన్వీనర్ చిన్న రాముడు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు ఖాసీం వలీ, గోపాల్ విమర్శించారు. సోమవారం వారు విలేకరుల మాట్లాడారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డిలు సర్వే నెంబర్లతో సహా వైసిపి ఎమ్మెల్యే అవినీతి గురించి ఆరోపణలు చేస్తే ఇంత వరకు సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు. వారిపై చేసిన విమర్శలు నిజమా, కాదా అనే విషయాన్ని ప్రజల మధ్య బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు దావీదు, మండల అధ్యక్షులు బాలరాజు, టిడిపి నాయకులు వెంకట్రాముడు, సోమన్న పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న టిడిపి నాయకులు



నందవరంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కౌలురైతు కార్డులతో ఉపయోగం

- ఎఒ శివశంకర్

ప్రజాశక్తి - హాలహర్వి

కౌలు రైతు కార్డులతో లబ్ధి పొందవచ్చని ఎఒ శివశంకర్ తెలిపారు. సోమవారం మండలంలోని బెవినాహాల్, కొక్కరచేడు గ్రామాల్లో సర్పంచి ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడారు. భూమిలేని రైతులు కౌలు చేసుకుంటే వారికి కౌలు రైతు గుర్తింపు కార్డు ఇస్తారని తెలిపారు. వీటివల్ల ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ పథకాలను పొందవచ్చని చెప్పారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం కౌలు చేసే రైతులకు అన్ని పథకాలు తీసుకోవడానికి కౌలు రైతు గుర్తింపు కార్డు ఇస్తోందని తెలిపారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎఒ

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

- ఎడిఎ మహ్మద్ ఖాద్రీ

ప్రజాశక్తి - నందవరం

నకిలీ విత్తనాలు అమ్మితే దుకాణం యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎడిఎ మహ్మద్ ఖాద్రీ హెచ్చరించారు. సోమవారం నందవరం, నాగలదిన్నె గ్రామాల్లో ఉన్న సీడ్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఇప్పటి వరకు వచ్చిన విత్తన స్టాక్‌ను పరిశీలించి, సోర్స్ సర్టిఫికెట్ గమనించారు. ఆయన మాట్లాడుతూ... విత్తనాలను ఎంఆర్‌పి ధరకే అమ్మాలని తెలిపారు. ఒక రకం విత్తనానికి, ఇంకో రకం విత్తనానికి లింక్ ఇవ్వరాదని, సీడ్ తీసుకున్న ప్రతి రైతుకూ బిల్ తప్పని సరిగా ఇస్తేనే రైతులకు వారి వారి పొలాన్ని బట్టి విత్తనం ఇవ్వాలని డీలర్లకు సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మేలో ఉన్న అధిక ఉష్ణోగ్రత వల్ల విత్తన మొలక శాతం తగ్గి, ఆకులు ఎర్ర బడి రైతులకు తీరని నష్టం జరిగే అవకాశం ఉందని, పత్తి విత్తనాలను మేలో నాటుకోవద్దని సూచించారు. ఎఇఒ సురేంద్ర గౌడ్ పాల్గొన్నారు.



స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ స్రవంతి



ఆర్థిక సాయం అందిస్తున్న మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు

అంబేద్కర్ విగ్రహానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మంత్రాలయం మండలం వి.తిమ్మాపురం గ్రామంలో గ్రామ పెద్దల సమక్షంలో ఈనెలలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ విగ్రహ దాత ఎఐసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మల్లెల గ్రూప్ అధినేత డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు సోమవారం తన స్వగృహంలో రూ.60 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహానికి ఆర్థిక సహాయం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ మాట్లాడుతూ... డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజ్ హిందూ, ముస్లిం, క్రిస్టియన్, దళిత, గిరిజనులు కులమతాలకు అతీతంగా సేవే మార్గం, సేవే లక్ష్యం అనే నినాదంతో ప్రజలకు సేవ చేయడం ఎంతో అభినందనీయమని తెలిపారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల, మామిడి నాగేష్, రామచిలకల విజయ్ కుమార్, చిక్కం దావీదు, చిక్కం మూర్తి, మామిడి ఏసన్న, రామచిలకల సుందర్ రాజ్, రామచిలకల జగన్, రామచిలకల ఆదాం, రామచిలకల భీమ్ గాడు, రామచిలకల బుజ్జి, చిక్కం రాజు, మామిడి వినోద్, చిక్కం యోహోను, చిక్కం సదా, మామిడి చిన్న నరసప్ప, రామచిలకల చిన్న ఏసేపు, చిక్కం ఆటో బుజ్జయ్య, చిక్కం ఆశీర్వాదం, వాల్మీకి తుమ్మలపల్లి నాగేంద్ర పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలి

- ఎపియుడబ్ల్యుజె నాయకులు



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి - ఆదోని

జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని నాయకులు కోరారు. సోమవారం జర్నలిస్టుల సమస్యలపైనా, అక్రిడిటేషన్ సమస్యపైనా ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జర్నలిస్టులు వినతిపత్రం ఇచ్చారు. ఎపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షులు దేవదాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు గౌస్ మహ్మద్, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు హుస్సేన్ బాష, నాయకులు సురేంద్ర, చార్లెస్, రామాంజనేయులు, సుధాకర్, వెంకటేశులు, కీర, బషీర్ అహ్మద్, నరసింహులు, ప్రకాష్ పాల్గొన్నారు. **హోళగుంద** తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఎపియుడబ్ల్యుజె మండల అధ్యక్షులు సిహెచ్.నాగరాజ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ హుస్సేన్‌సాబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎపియుడబ్ల్యుజె నాయకులు అమీర్ సాబ్, కె.నాగప్ప, హెచ్.విరుపాక్షి, ఎం.మహేష్, ఎం.ముదస్సార్, ఎం.రవికాంత్, ఈ.నాగరాజు గౌడ్, మంజునాథ్, విశ్వనాథ్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.


ఎస్‌పికి బొకే అందజేస్తున్న దిశా డిఎస్‌పి

ఎస్‌పిని కలిసిన దిశా డిఎస్‌పి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు దిశా డిఎస్‌పి ఐ.సుధాకర్ రెడ్డి సోమవారం జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్‌ను ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ రూ.500లకే అందించాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి మహిళకి 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య నగర కార్యదర్శి వరలక్ష్మి, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డిలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ బిజెపి, వైసిపి ప్రభుత్వాల ఎన్నికల గారడీలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. వెంటనే వంట గ్యాస్‌ను తెల్ల కార్డుదారులందరికీ 500 రూపాయలకే అందించాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కోడుమూరు

ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి గఫూర్ మియా, సిఐటియు మండల కార్యదర్శి వీరన్నలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామంలో వంక దగ్గర జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో వారు మాట్లాడారు. రెండు, మూడు వారాలు అయినా వేతనాలు పడడం లేదని, ఏ పనులు దొరకని సమయంలో కరువు పనైనా చేసుకొని కుటుంబాలు పోసించుకుంటున్నామని కూలీలు నాయకులతో వాపోయారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఉపాధి అధికారులు స్పందించి కూలీలకు వేతనాలు పెండింగ్ లేకుండా ఇవ్వాలని, సరైన వేతనాలు పడేలా చూడాల్సిన బాధ్యత వారిపై ఎంతైనా ఉందన్నారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న నాయకులు

గాడి తప్పిన 'ఇంటింటికి రేషన్'

- ప్రభుత్వ కాటాలు పక్కన పెట్టిన ఆపరేటర్లు
- సొంత కాటాలతో తూకాల్లో మోసాలు
- ఎండియుల అక్రమార్జనకే రెవిన్యూ అధికారుల వత్తాసు

ప్రజాశక్తి - పత్తికొండ

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలని ఎండియు వాహనాలను ఏర్పాటు చేసింది. ఎండియు వాహనాలకు కావాల్సిన సిబ్బందిని నియమించి పరికరాలను అందజేసింది. పత్తికొండ మండలంలోని 17 గ్రామాలకు 11 ఎండియు వాహనాలను పంపిణీ చేసింది. ప్రతి గ్రామానికి వెళ్లి ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలి. ఎండియు వాహనదారులు ప్రభుత్వం పంపిణీ చేసిన కాటాను పక్కనపెట్టి సొంత కాటాతో రేషన్ను పంపిణీ చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని రేషన్ కార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండియు వాహనదారులు సొంత కాటాలను ఏర్పాటు చేసుకొని కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తున్నారు. 25, 20, 15 కేజీల రేషన్ పంపిణీ చేయగా వాటిని మరో చోట కాటా వేస్తే 22, 18, 12 కేజీలు వస్తున్నాయని కార్డుదారులు చెబుతున్నారు. పామాయిల్, కంది బేడలు, అప్పడాలు, పసుపు నిత్యవసర సరుకులను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నా ఒక నెల ఇస్తూ మరో నెల లేవని ఇష్టముంటే తీసుకోండి, లేకపోతే లేదని రేషన్ కార్డుదారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొత్తపల్లి, పందికోన గ్రామాలకు వెళ్లే ఎండియు వాహనదారుడు పాలేకర్‌పై రేషన్ సక్రమంగా పంపిణీ చేయడం లేదని గత నెల 17న స్పందన కార్యక్రమంలో తాసిల్దార్ విష్ణు ప్రసాద్‌కు డీలర్లు లక్ష్మన్న, మల్లికార్జున ఫిర్యాదు చేశారు. డీలర్ల పరిస్థితే ఇలా ఉంటే కార్డుదారుల పరిస్థితి ఎలా ఉంటుందో..? మండలంలో ఎండియు వాహనదారులు మోసాలకు పాల్పడుతున్న రెవిన్యూ, పర్యవేక్షణ అధికారులు ఉన్నట్లా లేనట్లా అని కార్డుదారులకు అంతుచిక్కని ప్రశ్నగా మారింది.




సొంత కాటాతో తూకం వేస్తున్న దృశ్యం

నిద్రావస్థలో ప్రభుత్వ అధికారులు

ఇంటింటికి రేషన్ అందించాల్సిన ఎండీయూ వాహనాలు రోడ్డు పక్కన నిలబెట్టుకొని కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తుంటే రెవిన్యూ అధికారుల పర్యవేక్షణ ఉన్నట్లా.. లేక నిద్రావస్థలో ఉన్నట్లా..? ప్రభుత్వ కాటాను పక్కనపెట్టి సొంత కాటా ఏర్పాటు చేసుకొని రేషన్ పంపిణీ చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతాం.

- సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో ఈ వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ కార్యక్రమంను ఎంతో శ్రద్ధతో నిర్వహిస్తుందని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు కూరాడి చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులు విరివిగా పాల్గొని గ్రంథాలయంను, వేసవిజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖ గ్రంథాలయాలలో నేటి నుంచి వేసవిజ్ఞాన శిబిరాలు ప్రారంభమైనాయని తెలిపారు. విద్యార్థులకు ఇది మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో కెజి గంగాధర్ రెడ్డి, డబ్ల్యూ గోవిందరావు, మాజీ హెచ్ఎం, జనవిజ్ఞాన వేదిక సభ్యులు యాగంటీశ్వరప్ప, దామోదర్, యోగా మాస్టర్ సతీష్ కుమార్, రాఘవరెడ్డి, శర్మ, గ్రంథాలయాధికారులు వజ్రాల గోవిందరెడ్డి, యస్ భాష, చంద్రమ్మ, నషీమాబీ, ఈశ్వరమ్మ శ్రీనివాసులు, నాగ భాస్కర్, విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు. **పత్తికొండ :** పత్తికొండ పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని పత్తికొండ మాజీ ఎంపిపి నాగరత్నమ్మ ప్రారంభించారు. గ్రంథాలయ శాఖ అధికారి రామ్ కుమార్ అధ్యక్షతన ముఖ్య అతిథులుగా మాజీ ఎంపిపి సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వల చేశారు. కార్యక్రమంలో రచయిత సవ్వప్ప గారి ఈరన్న, ఎంఇఒ మస్తాన్వలి, డిగ్రీ కళాశాల వెంకటేశ్వర్లు యాదవ్, మహబూబ్ సాహెబ్ పాల్గొన్నారు.


పత్తికొండలో ప్రారంభిస్తున్న దృశ్యం


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇప్పించండి : సిఐటియు

ప్రజాశక్తి - మద్దికేర

మద్దికేర మండల కేంద్రంలో పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ పొద్దు పొడవక ముందే విధుల్లో పాల్గొని కష్టపడి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గత పది నెలలుగా జీతాలు రాలేదన్నారు. జీతాలు రాక ఇంట్లో కుటుంబ పోషణకు చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. మండల అధికారులు స్పందించి జిల్లా అధికారులకు సిఫారసు పంపించికార్మికులకు న్యాయం చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో పుష్పవతి, బజారమ్మ, నందిని, ఓబులమ్మ, తిమ్మక్క, రాహేళమ్మ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా కలెక్టర్కు వినతిని అందజేస్తున్న ఏపీ జేఏసీ అమరావతి నేతలు

ఉపాధ్యాయులపై అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : ఉపాధ్యాయులపై అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ గిరి కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగడం సరైనది కాదన్నారు. అక్రమంగా పెట్టిన సస్పెన్షన్లు ఎత్తివేయాలని లేకపోతే ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ కెవై.కృష్ణ, హెడ్మాస్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఓంకార్ యాదవ్, మునిసిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట రెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మరియానందం, డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వర రావు, టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, పంచాయత్ రాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపోగు సురేష్, క్లాస్-4 ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వసతి దీవెన జమ చేయాలి : ఎస్‌ఎఫ్ఐ

ప్రజాశక్తి - పత్తికొండ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లోకి విద్యా వసతి దీవెన కానుకను వెంటనే జమ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం పత్తికొండ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డిఓ మోహన్ దాస్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రైవేటు కళాశాల యాజమాన్యం విద్యా దీవెన కానుక చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు డబ్బులు జమ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే జమ చేయాలని కోరారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కర్నూల్ కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సూరి, వంశీ, బాలు, రవీంద్ర, దుర్గాప్రసాద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు..

కౌలు రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - తుగ్గలి : మండలం పరిధిలోని రాతన గ్రామంలో సోమవారం కౌలు రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ కౌలుకు తీసుకున్న రైతులు కచ్చితంగా కార్డులు పొందాలన్నారు. కార్డులు లేకుంటే కౌలు రైతు కింద ఉండరన్నారు. అలా లేకపోవడం వల్ల ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు అందవన్నారు. అందుకు ప్రతి రైతు కౌలు కార్డులను పొందాలని చెప్పారు.కౌలుకు చేస్తున్న రైతులు దరఖాస్తు చేసుకుంటే వారికి కౌలు రైతు కార్డులో మంజూరు చేస్తామని తెలియజేశారు. వీఆర్వో నాగేంద్ర, విహెచ్‌ఏ, వాలంటరీలు పాల్గొన్నారు.

రేమటకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు మండలంలోని రేమట గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ కర్నూలు జిల్లా కలెక్టర్ సృజనకు రాయలసీమ విద్యార్థి పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

హార్టికల్చర్ ప్లాంటేషన్‌కు ప్రణాళిక : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో హార్టికల్చర్ ప్లానిటేషన్కు ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వివిధ ప్రభుత్వ అంశాలపై జిల్లా స్థాయి అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా, మండల, గ్రామ స్థాయిలో సచివాలయాల్లో కూడా అందరూ చూడడంతో పాటు ప్రజా ప్రతినిధులు కూడా కార్యక్రమంలో పాల్గొనేలా మండల అధికారుల నుండి సచివాలయం సిబ్బంది, రెవెన్యూ, మున్సిపాలిటీ, సర్వే, పంచాయతీ రాజ్, హౌసింగ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, కాలుష్య నివారణ శాఖలకు సంబంధించిన రీఓపెన్ అయిన కేసులపై సమీక్షించాలన్నారు. అదే విధంగా అన్ని శాఖల ఉన్నతాధికారులు తప్పకుండా వివిధ శాఖలకు సంబంధించి ప్రభుత్వ పథకాల అమలుపై నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ హాజరు కావాలని, హాజరు కాలేని పక్షంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అయిన హాజరయ్యేలా చూడాలని డిఆర్‌ఓను ఆదేశించారు. హౌసింగ్‌కు సంబంధించి స్టేజ్ కన్వర్షన్ పనులు గత వారం నుండి ఇప్పటి వరకు తక్కువ స్థాయిలో గూడూరు, సి.బెళగల్, చిప్పగిరి, కోడుమూరు, నందవరం మండలాలు చేశారని, అందుకు సంబందించిన హౌసింగ్ సిబ్బందితో సమీక్షిస్తూ ప్రతి రోజు ఖర్చు, పురోగతి చూపేలా కృషి చేయాలని అందుకు గాను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లిఖార్జునను నియమించామన్నారు. లేబర్ మొబిలైజేషన్‌కి సంబంధించి కల్లూరు, దేవనకొండ, మద్దికేర ,కోడుమూరు మండలాల్లో తక్కువగా నమోదు చేశారని, వచ్చే వారంలోపు లక్ష్యాన్ని సాధించేలా సంబంధం ఎంపీడీవోలను ఆదేశించారు. ముఖ్యంగా ఆదోని ప్రాంత అభివృద్ధికి హార్టికల్చర్ పెంపకానికి భూములను గుర్తించేలా చూడాలని ఎంపిడిఓలు, స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య ఓటిఎస్ అంశంపై సమీక్ష నిర్వహిస్తూ ఓటిఎస్‌కు సంబంధించిన పెండింగ్ రిజిస్ట్రేషన్ వెరిఫై చేయించి పూర్తి నివేదిక శుక్రవారంలోపు పంపాలని తహశీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ సుబ్రమణ్యం, హౌసింగ్ పిడి వెంకట నారాయణ, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ క్రీడా మైదానాన్ని తీర్చిదిద్దాలి

- పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్.

ఎంతో చరిత్ర కలిగిన కర్నూలు మెడికల్ కాలేజీ గ్రౌండు కొన్నేళ్లుగా ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి గురై చేపల చెరువుగా మారిందని, మైదానాన్ని తీర్చిదిద్దాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం సోమవారం మెడికల్ కాలేజీ మైదానంలో పర్యటించింది. ఈ సందర్భంగా సంఘం సీనియర్ నాయకుడు ఎం.యాకోబు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, టి.హరికృష్ణలు మాట్లాడారు. ఎంతో చరిత్ర కలిగి, ఎంతోమందిని వైద్య రంగ నిపుణులను తయారు చేసిన మెడికల్ కాలేజీ గ్రౌండ్ నేడు చేపల చెరువుగా మారి కప్పలు గుడ్లు పెడుతూ వాటికోసం వచ్చే పాములకు నిలయంగా మారిందన్నారు. కాలినడక ఎక్సర్సైజులు, క్రీడలు ఆరోగ్యానికి మంచిదని వైద్య నిపుణులు చెబుతూ వారి పక్కనున్న గ్రౌండును ఇలా వదిలేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వ సంస్థ అయిన మెడికల్ కాలేజీ ఆవరణ మైదానంలో చెట్లను నరికి వేయిస్తున్నారని, పర్యావరణాన్ని కాపాడడం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. కలెక్టర్ జోక్యం చేసుకొని చెట్లను నరికించిన వారిపై చర్యలు తీసుకుని, గ్రౌండును మరమ్మతులు చేయించి వైద్య విద్యార్థులతో పాటు స్థానికులకు కూడా ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నగర నాయకులు ఏ.వెంకటేశ్వర్లు, ఎన్.శ్రీనివాసరెడ్డి, కె.మధుసూదన్, కె.రామకృష్ణ పాల్గొన్నారు.


మైదానాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సైడ్ కాలువ ద్వారా నీరు పోయేలా చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - మద్దికెర

మద్దికేర మండలం యడవలి గ్రామపంచాయతీ దళితవాడలో సైడ్ కాలువల ద్వారా నీళు పోయేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో అధికారులకు సోమవారం వినతి పత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వ నిధులు లక్షలు ఖర్చుపెట్టి కొత్త సిసి రోడ్డు, సైడ్ కాలువలు వేశారని, కానీ నీళ్లు పోయేలా చేయలేదన్నారు. సైడ్ కాలువలు సరిగా లేకపోవడం వల్ల సిసి రోడ్డు మీద పడిన వర్షపు నీరు ఇళ్లలోకి పోయి రాత్రిపూట నిద్రలేక చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గతంలో కూడా సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులకు వినతి పత్రాలు ఎన్నోసార్లు ఇచ్చినా పరిష్కారం చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు పకీరప్ప పెద్దన్న ఓబులేసు రంగన్న పాల్గొన్నారు.


సిఎంకు బొకే అందజేస్తున్న కైప పద్మలత రెడ్డి, కెవి సుబ్బారెడ్డి

సిఎంను కలిసిన కార్పొరేటర్

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

కర్నూలు నగరంలోని 17వ వార్డ్ కార్పొరేటర్ కైప పద్మలత రెడ్డి సోమవారం తాడేపల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె తన తండ్రి కెవి సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత డాక్టర్ కెవి సుబ్బారెడ్డితో కలిసి పూలబొకేను సిఎంకు అందజేశారు.

లక్ష్మీనగర్ దుర్గంధ భరితం

- మురుగునీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఇటీవల వర్షాలు పడుతుండడంతో లక్ష్మీ నగర్‌లో మరుగు కాలువల నుండి నీరు రోడ్లపైకి వచ్చి దుర్గంధాన్ని వెదజల్లుతుందని, ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, వెంటనే చర్యలు తీసుకొని మరుగునీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని లక్ష్మీనగర్ వాసి శ్రీనివాసులు అదనపు కమిషనర్‌కు విన్నవించారు. సోమవారం కర్నూలు మున్సిపల్ హాల్‌లో స్పందన కార్యక్రమం జరిగింది. కర్నూలు నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్ ప్రజలను అర్జీలను స్వీకరించారు. అలాగే పలు నగర్‌ల ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ వేణుగోపాల్, ఎసిపి రంగస్వామి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఒ జునీద్, సానిటరీ సూపర్వైజర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.




అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

అర్హులైన విలేకరులందరికీ

అక్రిడిటేషన్ మంజూరు చేయాలి : ఎపియుడబ్ల్యూజె

ప్రజాశక్తి - పత్తికొండ

పత్రికలకు సర్క్యులేషన్ ప్రాతిపాదికన కాకుండా మండలానికి ఒక అక్రిడేషన్ ఇవ్వాలని ఎపి యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపియుడబ్ల్యూజె) నియోజకవర్గ అధ్యక్షుడు ఎం.సాల్ రంగడు, జిల్లా నాయకులు ఇర్ఫాన్, కోశాధికారి మంజునాథ్‌లు డిమాండ్ చేశారు. రాష్ట్ర, జిల్లా కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక ఆర్డిఓ మోహన్ దాసును నాయకులు, విలేకరులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి, అక్రిడేషన్ల కోసం ఇచ్చిన జీవో వల్ల జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారని తెలిపారు. జర్నలిస్టులు ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న అనేక సౌలభ్యాలను ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. న్యూస్ పేపర్స్‌కు సర్క్యులేషన్ నిబంధన పేరుతో కోత విధించకుండా మండలానికి ఒక అక్రిడేషన్ ఇవ్వాలని, చిన్న పత్రికలకు అక్రిడేషన్ సంఖ్యను పెంచాలని, పిడిఎఫ్‌లకు గతంలో మాదిరి రెండు అక్రిడేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాల విభజన నేపథ్యంలో బస్సు పాసులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెల్లుబాటు అయ్యేలా ఇవ్వాలన్నారు. జర్నలిస్టులు అందరికీ ఏసి బస్సుల్లో కూడా పాసులు చెల్లుబాటు అయ్యేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికి 3 సెంట్ల ఇంటి స్థలం, ఇండ్లు మంజూరు చేయాలన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణకు కమిటీని, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పాలసీని, రైల్వేలో రాయితీలను పునరుద్ధరించాలన్నారు. తమిళనాడు తరహాలో జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. కరోనా వల్ల మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన 5 లక్షల రూపాయలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్స్‌ను వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో దశల వారిగ ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమయితే ఛలో విజయవాడ కార్యక్రమం కూడా చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజవర్గ గౌరవ సలహాదారుడు యం.నాగరాజు, సీనియర్ నాయకులు చిన్న గిడ్డయ్య, పవన్, మదుబాబు, నియోజకవర్గ ఉపాధ్యక్షులు రంగన్న, సహకార దర్శి గడ్డం కుమార్, నియోజవర్గ ఆర్గనైజింగ్ నెంబర్ తాజు మహమ్మద్, మండల సహాయ కార్యదర్శి షఫి, గోపాలకృష్ణ, హరిబాబు, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఎపియుడబ్ల్యూజె ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, జర్నలిస్టులు